క్లుప్తంగా

చెస్ విజేతలకు బహుమతులు



బహుమతులతో చెస్ విజేతలు

భీమవరం: స్థానిక వన్‌టౌన్‌లో ఆదివారం నిర్వహించిన ఇన్విటేషనల్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీ నిర్వాహకుడు, జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కిషోర్ మాట్లాడుతూ ఆరు గ్రూపుల్లోని విజేతలకు రూ.20 వేల విలువైన బహుమతులు అందించినట్లు చెప్పారు.

చెరుకువాడ శివారు.. ప్రయాణం బేజారు



చెరుకువాడ శివారులో జాతీయరహదారి అధ్వానంగా మారిన దృశ్యం

ఉండి: చెరుకువాడ శివారులో జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. చెరుకువాడ శివారులోని రైస్ మిల్లులు వద్ద నుంచి ఆకివీడు పరిధి వరకు సుమారు కిలోమీటరు మేర ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఇక్కడ గుంతలు ఎక్కువగా ఉండడం, రహదారి ఎగుడు దిగుడుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారి ఉండి కాలువలోకి జారిపోతుండటం ఈ పరిస్థితులకు కారణంగా చెబుతున్నారు. జాతీయ రహదారి కావడంతో వాహనాలు కూడా వేగంగా ప్రయాణిస్తుండడం, రహదారి అధ్వానంగా ఉండడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారి 165పై ఉండి రైల్వేగేటు దాటింది మొదలు ఆకివీడు చేరేలోపుగా వారానికి రెండు లేదా మూడు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా గోరింతోట చర్చి సమీపంలో, కలిసిపూడి గ్రామపరిధిలో చెరుకువాడ ఇరువైపులా సరిహద్దుల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో మరమ్మతు పనులు నిర్వహిస్తున్నా వాటిలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అనతికాలంలోనే గోతులమయంగా మారిపోతున్నాయి.

చర్యలు చేపట్టాలి



చెరుకువాడ గ్రామానికి ఇరు వైపులా అజ్జమూరు సరిహద్దు, కలిసిపూడి సరిహద్దులు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– కొర్రపాటి అనిత, చెరుకువాడ

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు



గత కొన్నేళ్లుగా చెరుకువాడ, కలిసిపూడి, ఆకివీడు మండల సరిహద్దుల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. జాతీయ రహదారిపై ఏర్పడుతున్న గోతులు, ఉండి కాలువలోకి రోడ్డు జారిపోతున్న ప్రాంతాల్లోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలి.

– బండెల జార్జ్‌రాజు, చెరుకువాడ

ఉచిత ధ్యాన శిక్షణ



ఉచిత ధ్యాన శిక్షణ ఇస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టగుంట గ్రామానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ తిరుమాని బ్రహ్మం పాల్గొని జ్ఞాన బోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. భగవద్గీత శ్లోకాలు, ఆధ్యాత్మిక గీతాలు రాగయుక్తంగా పాడి, యోగార్థాలను వివరించి అందరితో ధ్యానం చేయించారు. జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు తిరుపతిలో జరిగే ధ్యాన మహాయజ్ఞంకు అందరూ రావాలని కోరారు.

ఉండి బస్టాండు..

ప్రయాణికుల పాట్లు మెండు



ఇటీవలే ఉండి బస్టాండ్‌లో వేసిన కంకరు మట్టి (గ్రావెల్) రోడ్డు బురదమయంగా మారిన దృశ్యం

ఉండి: ప్రయాణికులపై ఆర్టీసీ అధికారులకున్న ప్రేమ ఏంటో ఉండి బస్టాండ్‌ను చూస్తే అర్థం అవుతోంది. కనీసం బస్టాండ్‌లోకి వెళ్లే మార్గం కూడా సరిగా లేకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గత కొంతకాలంగా ఉండి బస్టాండ్ దుస్థితిపై మీడియాలో కథనాలు రావడంతో ఆర్టీసీ అధికారులు స్పందించి ఉండి బస్టాండ్‌లో రోడ్డు వేశారు. కానీ కేవలం గ్రావెల్ (కంకరు మట్టి) రోడ్డు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ కంకరు రోడ్డు కాస్త బురదమయంగా మారడంతో ప్రయాణికులు బస్టాండ్ లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉండి జంక్షన్‌లో ప్రతిరోజు సుమారు వందపైనే బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు లేకపోగా కనీసం బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

ఉండి: ఉండి గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీ అయిన ఉద్యోగులను ఆదివారం రైతులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న వ్యవసాయ సహాయకుడు (వీఏఏ) జల్లి ఆల్‌ఫ్రెడ్, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ) ఆదిన కీర్త స్వప్న ప్రియలను రైతులు సత్కరించారు.

జూదరుల అరెస్ట్

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12వ వార్డులో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్ కుమార్ తెలిపారు. నిందితుల నుంచి రూ.2,930 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

అన్నసమారాధన

ఆకివీడు: స్థానిక శాంతినగర్ వద్ద వేంచేసియున్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

17న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్



డీఎంహెచ్‌వో గీతాభాయి

భీమవరం (ప్రకాశంచౌక్): మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను దేశ వ్యాప్తంగా ఈనెల 17వ తేదీన ప్రారంభించనున్నారని డీఎంహెచ్‌వో గీతాభాయి తెలిపారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు, ఈ శిబిరాల్లో ప్రత్యేకంగా మహిళలు, పిల్లలకు విస్తృత వైద్య సేవలను అందిస్తామన్నారు. ప్రసూతి, కంటి పరీక్షలు, ఈఎన్‌టీ, దంత, చర్మవ్యాధి, మధుమేహం, రక్తపోటు, కేన్సర్లు, టీబీ, ఎనీమియా, సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు, రక్తదాన కార్యక్రమాలు, పౌష్టికాహార అవగాహన, వయో వందన కార్డుల నమోదులు జరుగుతాయన్నారు, ప్రోగ్రాం ఆఫీసర్ కేఎంఆర్ కిషోర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆరోగ్యవంతమైన కుటుంబాలు, శక్తివంతమైన సమాజాల నిర్మాణమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా చినిమిల్లి జన్మదిన వేడుకలు



చినిమిల్లి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం మండలంలోని రాయలంలో గ్రామంలో పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు చినిమిల్లికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న వారిలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, మేడిది జాన్సన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఏఎస్ రాజు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, భీమవరం పట్టణ, రూరల్, వీరవాసరం, మండలాధ్యక్షులు గాదిరాజు రామరాజు, జల్లా కొండయ్య, చవ్వాకుల సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకట స్వామి, పట్టణ మాజీ అధ్యక్షుడు కోడే యుగంధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరంలో సేవా కార్యక్రమాలు

వీరవాసరం: వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకటరాయుడు పుట్టినరోజు సందర్భంగా పార్టీ వీరవాసరం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే చినిమిల్లి జన్మదిన వేడుకకు మండలంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున భీమవరం తరలివెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి, వీరవాసరం పట్టణ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాసరావు, నాయకులు గూడూరి ఓంకారం, నేతలు జ్ఞాన సుందర్రాజు, మానుకొండ ప్రదీప్ కుమార్, నాగరాజు శ్రీనివాసరాజు, మద్దాల అప్పారావు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, పిల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవం



పూజలందుకున్న వినాయకుడు

పాలకోడేరు: విస్సాకోడేరులో ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలు, మేళ తాళాల నడుమ స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించి అనంతరం నిమజ్జనం జరిపారు. గణేషుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని కునుకు దుర్గారావు రూ.72 వేలకు వేలంలో దక్కించుకున్నారు. పాలకొల్లు, భీమవరం రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌ను మళ్లించారు.

హిందీ ఉపాధ్యాయులకు సత్కారం



హిందీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

భీమవరం: హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్‌లోని 24 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. గత 26 ఏళ్లుగా హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు రంగ సాయిని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అభినందించారు. కార్యక్రమంలో పాత్తూరి బాపిరాజు, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, టీవీవీ ప్రసాద్, వలవల సాయిబాబా, కే మోహిని, ఎస్ సబనా, కామాక్షి, ఎన్ రాధా తదితరులు పాల్గొన్నారు.

విష్ణు కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

భీమవరం: విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) తృతీయ గ్రాడ్యుయేషన్ డే ఆదివారం కళాశాల దక్షిణ క్యాంపస్‌లోని విష్ణు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ 2025 బ్యాచ్‌కు చెందిన 1,091 మంది బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేసి, అకడమిక్ టాపర్లకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.శ్రీలక్ష్మి, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. చైర్మన్‌గా గనిరెడ్డి త్రినాథ్, నల్లం గంగాధరరావు, పాలకోడేటి కార్తీక్, మల్లులవలస రఘుబాబు, చింతాడ నాగలక్ష్మి, ఆకుల హైమవతి, బండి లక్ష్మి అశ్విని, ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఆలయ అర్చకులైన కొత్తలంక వీర వెంకట రామశాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారని కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల నూతన కమిటీ ఏర్పాటు

ఆకివీడు: దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నూతన కమిటీ ఆదివారం ఏర్పడింది. కమిటీ అధ్యక్షుడిగా గొంట్లా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా చింతలపాటి సీతారామరాజు, కార్యదర్శిగా నేరెళ్ల రామచెంచయ్య, జాయింట్ సెక్రటరీగా చొప్పెర్ల సీతారామచంద్రమూర్తి, కోశాధికారిగా గుర్రం ఈశ్వరరావులతో పాటు కార్యవర్గం ఏర్పడింది.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

నరసాపురం రూరల్: రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన కుట్టు మెషీన్ల పంపిణీ మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బర్రే శ్రీ వెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పర్రు పెద్దపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ నల్లి వరలక్ష్మి జేమ్స్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్టు నిర్వాహకులు గంటా రాజ్ కుమార్, గంట సుందర్‌కుమార్ లు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పరులో 23 మంది మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జాన్ కెనడీ, నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బూసి విశ్వేశ్వరరావు, వెన్న ప్రకాష్, ఉపాధ్యక్షుడు వైదాని నాగేశ్వరరావు, కోశాధికారి పూరిళ్ళ శ్రీనివాస్, న్యాయవాదులు పోలిశెట్టి బాబ్జి, శ్రీ రఘురామారావు పాల్గొన్నారు.

రోడ్డు కోసం రిలే దీక్షలు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం వెంప–మొగల్తూరు రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంఐక్యవేదిక కన్వీనర్ యడ్ల చిట్టిబాబు మాట్లాడుతూ వెంటనే రోడ్డు నిర్మా ణం చేపట్టకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ దీక్షలో బంగారు వెంకట సీతారామయ్య, అడ్డాల ఏడుకొండలు, కుందేటి వెంకటేశ్వరరావు, వాముశెట్టి బోసుబాబు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

యలమంచిలి: మండలంలోని గుంపర్రు పంచాయతీ కడిమిపుంతలో ఇరువర్గాల మధ్య సరిహద్దు వివాదం కారణంగా ఘర్షణ చెలరేగింది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు ఒకరి పై ఒకరు కేసు పెట్టడంతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు.